# ౧ పొట్టిరవికలూ - వాలుజడలూ

ఆ చేడెల కిద్దటికీ ఎంత నేస్తంఅంటే కుళాయినీళ్ళ కెళ్లేటప్పుడు కూడా ఉత్తబిందె ఇద్దటూ తోడట్టుకెడతారు. తోడికోడళ్ళా అంటే తోడికోడళ్ళు కారు. ఒక యింటి ఆడపడుచులా అంటే వాళ్ళూకారు, వదినే మరదండ్రా అంటే ఉఁహూ. కుఱ్ఱయీడూ యిద్దరిదీకూడా. ఇద్దరిఛాయా కూడా సాయంకాలం నీరెండలో నీలాంబరపూవన్నె ననుకరిస్తూ వుంటుంది. రోడ్డుమీద ఇద్దరి నీడలూ ఒకటే పొడుగు; ఇద్దరి జడలూ వాలుజడలే. నల్లని ఒత్తుకురులు పెనేసి చివర రిబ్బను ముక్కలు ముడెట్టి సాగలాగినవే. వెనక్కు వెన్నుపూసనే పడేస్తే పిఱుదలకందం. ముందుకు బుజమ్మీద నుంచి తీసుకుంటే ఉరోజాల కందం. జడలంటే అలా వుండాలి. గమి చెణ్ణీకుండా కప్పవలసినచోట కప్పుతూ, కుప్పసం కొంచెం కుస్తవగుడ్డ తక్కువదైనా కాపాడాలి, కచమన్నాక కుచాన్ని.

ఏమా అంటే ఈ రోజుల్లో రవికలు బొత్తిగా చిన్నవీ పలచనివీ కుట్టించేస్తూన్నారు స్త్రీలు. వాటిని రవికలనడానికి వీల్లేదు. — ఇక్కడ కొంచెం కథకు సందర్భించని రెండు ముక్కలు జ్ఞాపకం వస్తూన్నాయి; భారతగాథలో ఇతిహాసాల్లాగు — రామాయణంలో పిడుకల వేత కాదు లేండి. ఇంపుగానే వుంటాయి, స్త్రీలు కులాసాగా అంతా విని చివర చిరాకు పడ్డాగానీ—

ఒకావిడ రైక సరిగా తొడుక్కోకుండానో సగం సగం కనబడే లాగు తొడుక్కొనో, మగని దగ్గఱకెళ్ళి "ఆర్యపుత్రా! రవికాననిచో కవిగాంచునేగదా" అంటారే కవిచూచేది ఏమిటండీ?" అని అడిగిందట. అంటే భర్త "సీబోర" అన్నాట్ట చఱ్ఱున చపేట ఇచ్చినట్టు. ఆమె పాపం — రవి అంటే సూర్యుడు, సూర్యుడు కాననిచో అని ముచ్చటగా ముద్దుగా ఊహించు కడిగింది. అతగాడు ఆ పెదర్థాల పెనిమిటి, రవిక = రైక, అననిచో = సరిగా అనకపోతే అనగా అమరకపోతే, అంటే ఉండకపోతే, అని ఆ యిల్లాలి రూపు సంవర్భాన్ని బట్టి అలా అధ్వాన్నం మధ్యాహ్నంగా అన్వయించేడు కాబోలు — దగ్గరే కవి ఉంటే ఎంత సిగ్గుపడిపోయేదో ఆ పఙతి- దానికేం, భార్యా భర్తలమధ్య సవాలు అది. మరోగాథ విన్నది చెప్తాను. ఒకాయన బావ వరస వాడు ఓపడుచు మఱదల్తో కబుర్లు చెబుతూ వంటింట్లో కూర్చున్నాట్ట. ఆ మఱదలు సూరాగుమ్మడికాయ దభీమని కూరకో పులుసుకో నేలనేసి కొట్టి ఓముక్క కత్తిపీటను పరపరా తరుగుతూందిట. ఆమె అసలే రవిక తొడుక్కోని పడుచుపిల్ల. మడికి పలాచటి బిన్నీ కంపెనీ తెల్ల చీరకట్టుకోని ఇలా తరుగుతూంది — అరచాటగు ఆంధ్రవధూటి జ్ఞాపకం వచ్చేటట్టు. ఈ బావ తోచకో మంచి దుక్కలాంటి ఉబ్బివున్న గుమ్మడి గింజ జారుజారుది తన కుడిచేతి బొట్టన వ్రేలికి తర్జనికి మధ్య పెట్టుకొని యాదాలాపంగా నొక్కేట్ట — చఱ్ఱునవెళ్ళి తిన్నగా అది ఆ మరదలి దక్షిణ చూచుకాగ్రమ్మీద తగిలిందట — ఎడంభాగం గుండె అవిరేటట్టు. పైకేమంటుందీ? ఓర్చుకుని ఊరుకుందట. ఇవన్నీ స్త్రీయొక్క మానం కాపాడ్డం అనే రసవత్తర ఘట్టాని కుపాఖ్యానాలు — చూడండీ! ఆ పరిస్థితుల్లో కనక జడలే అడ్డుంటే స్త్రీకి సిగ్గుపడవలసిన అవసరంలేదు. అపాయం తటస్థించదు. అందుకే కొందరు బుద్ధిమంతురాండ్రైన పెద్ద

ముత్తైదువులు ఇప్పుడిప్పుడు జ్ఞానం తెచ్చుకుని సిగలూ కొప్పులూ మానేసి వాలుజడలే వేసుకుంటున్నారు.

ఇక అసలు కథకు వద్దాం, జడలన్నవి అలావుండాలి. అందు కోసం కావాలి—ఇంతకూ చదువరుల్ని ఓసందేహంలో వదిలేశాను. ఆ చేడె లిద్దరూ ఇంతకూ రవికలు తొడుక్కున్నవాళ్ళా, తొడుక్కున్నా చాలీ చాలని రవికలు తొడుక్కున్నవాళ్ళా. లేకపోతే యేమిటి అని ఇంతవరకు వివక్షత చెప్పకుండా వుండమనేది నాదే క్రౌర్యము. వాళ్ళకిద్దరికూ రవికలున్నాయి. తెల్లని గ్లాస్గోమల్లువి మెడదగ్గర ఊటకలం తగిలింపు కనుకూల మైన చంద్రవంక కత్తిరింపువీ, బుజాలు పైని దిగలాగితే దిగు చాయను గాలిదేవుడు కితకితలెట్టేవీ—రవికలు తొడుక్కున్నా లేనట్టే అని భావించుకోండి. ఇంక చీరకట్టు తదనుగుణ్యం. గాలి వాళ్ళకు ఎదురుగా వీస్తోంది. అప్పుడే అందం అంతా ! ఆదోగ్గాదిగిన కదళీ స్కంధాలవంటి తొడల మధ్య నా స్త్రీలయొక్క చీర కుచ్చెళ్లొదిగొదిగి పోతూంటే ఆ వ్యంగ్యాని కంతే లేక పోయింది. మగవాళ్ళనుకొన్నారంటే అనుకోరు మరి !

అందులో ఒకడికి పెద్ద బుగ్గ మీసాలు. ఒకడికి ఫ్రెంచికట్— ఫ్రెంచికట్ వాడన్నాడు. "ప్రేమసువాస నేసుకుంటూ వస్తూవుంది. కాసుకో" అన్నాడు. బుగ్గమీసాల వాడు తనచేతితో మీసాలు సవరించు కొని ముక్కు సరిచేసుకొనేలోపున స్త్రీలిద్దరూ వాళ్ళను దాటిపోయినారు. "ఎక్కడ !" అన్నాడు బుగ్గమీసాలవాడు. అందుకే అంతంత మీసాలు తీసేసి నాలాగు ముక్కుకింద మాత్రమే కాస్సి పలచ పలచగా ఉంచుకో మంటాను. — చెయిపెట్టి మీసాలు ఒత్తుగించుకొని ముక్కుసోణాలు పెద్దవి చేసుకొనేదాకా ప్రేమవాసన నీకోసం ఆగివుందీ ? ఇప్పుడే అలా

వెళ్ళింది. గుమ్మైపోయింది నాముక్కు." అన్నాడు ఫ్రెంచికట్‌గాడు. "అంతగా వాసనే ప్రాముఖ్యమైంది అని తోస్తే ఆ రెండు వెంట్రుకలూ మాత్రం ఎందుకు?" అన్నాడు బుగ్గమీసాలవాడు. "ఈ రోజుల్లో ప్రేమ దాని యొక్క ఆఘ్రాణపు ఘాటునుబట్టి గ్రహించుకోవడం కాకపోతే పాణిగ్రహణేన అనుకొన్నావా యేమిటి? కాదు. ఇక ముక్కు కింద ఈ రెండు వెంట్రుకలయొక్క ప్రయోజనం చెప్పమన్నావా? అవి మగ చాయకు గుర్తు. లేకపోతే ఆడమొగానికీ పేడిమొగానికీ తేడాయే తేలీదు. — ఏమైతేనేం హేటుంటూవుంటే ఫ్రెంచికట్ ఉండాలి మీసాలకు." అని తన నెత్తిమీద హేటుతీసి చంకలో పెట్టుకొని "నీకేం పరిమళించలేమా? బొత్తిగా పరిమళించలేమా ప్రేమ? — ఆ వెళ్ళే పిల్లలిద్దరూ మిషన్ బోర్డింగులోని పిల్లలు. ఓదాని పేరు మిస్ పుస్సీఫుట్టు, రెండవదాని పేరు మిస్ థారంటన్. నీక్కావలీ అంటే మిస్ థారంటన్‌ని ప్రేమించుకోవచ్చు. మిస్ పుస్సీఫుట్టు నాది —" అన్నాడు ఫ్రెంచికట్ మీసగాడు. బుగ్గమీసాలమనిషి అన్నాడు, "నేను అచ్చవైదీకపు ముండావాణ్ణి — మీసాలు పెంచుకొనేసరికే మాతాత ముత్తాతలు పైని తహతహ లాడిపోతున్నారు. ఇక మిస్ థారంటన్నుని ప్రేమిస్తే తార్‌తారయిపోరూ? అది వర్ణాంతర వివాహంకూడా కాకుండా — మతాంతర వివాహంకూడా అయిపోయి అటు బంగాళాఖాతాన్ని ఇటు అరేబియా సముద్రాన్ని ఉప్పెనెత్తించి దక్కను పీఠభూముల్ని హిమాలయా శిఖరాల్నికూడా ముంచేస్తుంది. భారతవర్షం పిపీలికాది సమేతంగా సఫా —" అన్నాడు. ఫ్రెంచికట్‌గాడన్నాడు "ఈ వేళకు ఈ చూపూ ఈ వెలుగూ చాలుమనకు. గుడ్‌నైట్!" అన్నాడు. ఎవరికి వాళ్ళు వెళ్ళిపోయినారు.

నిజంగా ఆ స్త్రీలెవ్వరో ఆ మగవాళ్ళకు తెలియదు. ఆ మగవాళ్ళెవరో ఆ స్త్రీలకు తెలియదు. బాధ్యతలేని మగాళ్ళు ఆడాళ్ళనుగురించీ,

బాధ్యతలేని ఆడాళ్ళు మగాళ్ళను గురించీ, ఏదో అనుకుంటూ ఉత్తర క్షణమందే మరోపనిమీద ఏమటిపోయే వెట్టి చిద్విలాసపు నాటక ప్రదర్శనం అనుకోండి ఆ సాయంకాలం ఆ పురుషుల సంభాషణా ఆ పడుచుల సందర్శనమూను.

కాలనేమికింద అయిదారేళ్ళు నుసుపెక్కు పప్పుపప్పు అయిపోయినాయి. ఈ పైని వ్రాసేది అప్పటిమాట. మిస్ థారంటన్ ఒక డిప్యూటీ ఇన్స్పెక్ట్రిస్ ఆఫ్ గర్ల్సుస్కూల్సు అయింది. బుగ్గమీసాలమనిషి ఎక్కడా ఉద్యోగందొరక్క ఒక ఆడపిల్లలబళ్లో తెలుగుచెప్పే బడిపంతులయినాడు. మిస్ థారంటన్ ఆ గర్ల్సుస్కూలు పరీక్ష చేయడానికి వెళ్ళింది. గడగడలాడుతూ బుగ్గమీసాలాయన నిలబడి అమ్మగార్కి సలాం పెట్టినాడు.

మిస్ థారంటన్ అంది "ఏమండీ! మాష్టర్? మీముఖం ఎక్కడో ఈవరకు చూచినట్టుగా ఉన్నదండీ" అని. "ఏమిటో వైదీకి మీసాలు తల్లీ" అన్నాడు వెట్టిబాగుర్రాయడులాగు బ్రాహ్మడు. మిస్సమ్మగారన్నారు 'వేడిక్ముష్టాష్'! అని. తెలుగు పండితుడు "ఇంకేం వేడితల్లీ? కాగి చల్లారిన పాలలాగు అయిపోయాను. నలుగురు పిల్లలూ భార్యా మసీలి తల్లీ — ప్రమోషన్కు రికమెండు చెయ్యాలి" అన్నాడు. "మిస్పప్సీ పుట్టు ఇన్స్పెక్ట్రిస్ ఆఫ్ ఫస్టు సర్కిల్. ఆవిణ్ణి చూడండి." అంది మిస్ థారంటన్. "కాని ఆవిడ ప్రియుడీది ఫ్రెంచికట్. ఆలోచించుకోండి" అని అందికూడాను, వినిపించీ వినబడనట్టు. అంతకంటె వినిపించీ వినబడనట్టు పండితరాయలన్నాడు "అయితేం అమ్మగారూ ఆవిడదీ పొట్టిరయికే వాలుజడే అనుకుంటాను ఇప్పటికీ! స్వతంత్రించి ఆర్డరు వెయ్యకపోరు. వెళ్ళి తప్పకుండా దర్శనం చేసుకుంటాను" అని. తెనుగు మాష్టరు మహాచెడ్డముండాకొడుకు!!!

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 20-7-1934 | రాజమండ్రి | "వినోదిని"లో |